క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పెనమలూరు: మినుము పంటకు పురుగులు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ సూచించారు. యనమలకుదురు, గంగూరు గ్రామాల్లో మంగళవారం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా మినుము పంటకు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా మోతాదుకు మించి ఎరువులు వాడరాదన్నారు. కాగా వరి కోతలు కోసిన రైతులు ధాన్యం మిల్లుకు వెంటనే తరలించాలని అన్నారు. దాళ్వ సాగు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు అహల్య, జమీల అంజు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



కంకిపాడు: గ్రామాల అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా సాధించుకోవాలని రీసోర్సు పర్సన్‌లు సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. రీసోర్సు పర్సన్‌లు డి.బాలాజీ, సీహెచ్ కిరణ్, ఏఎంపీ మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి, ఈఓఆర్డీ కిరణ్మయి, ఏఓ ఎన్.బసవయ్య శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి విషయంలో అందరి సమన్వయం అవసరమన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించడంతో పాటు సైడు డ్రెయిన్లు మంగళవారం పూడిక తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి మురుగునీరు సజావుగా పారుదల అయ్యేలా పూడిక తీస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 49 మందికి ఉద్యోగాలు



గన్నవరం: మండలంలోని దావాజీగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్‌బాబు తెలిపారు. ఫ్రింగిల్ ఐటీ వెంచర్స్, యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్, టాటా క్యాపిటల్, రమా క్లాత్ స్టోర్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ నేతృత్వంలో జాబ్‌మేళా ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. నరేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి, నైపుణ్యాభివృద్ధి నియామకాధికారి తుర్లపాటి మధు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ బీఎస్ఆర్ సుజీత్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని నాక్ సెంటరులో మంగళవారం జరిగిన జాబ్ మేళాలో 37 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నరేష్‌కుమార్, ప్రతినిధులు వాసు, సుధాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నదాతల్లో వణుకు

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- మారిన వాతావరణం
- చిరుజల్లులతో రైతుల్లో గుబులు
- భారీ వర్ష హెచ్చరికలతో భయాందోళన

కంకిపాడు/పెనమలూరు: అన్నదాతల్లో గుబులు మొదలైంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ఖరీఫ్ వరి కోతలు వేగంగా జరుగుతుండటంతో రైతాంగం మిల్లులకు ధాన్యం తరలించే పనిలో ఉన్నారు. మరోవైపు ఖరీఫ్‌లో మెట్టలో సాగుచేసిన మినుము తీత పనులు పూర్తై పంట చేలల్లో ఉంది. ఇలాంటి పరిస్థితులతో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షసూచన రైతుల్లో గుబులు రేపుతోంది.

అల్పపీడన ప్రభావంతో మార్పులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కృష్ణా జిల్లా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్మేశాయి. అక్కడక్కడా చిరుజల్లులు పడుతున్నాయి. బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.51 లక్షల హెక్టార్లలో జిల్లాలో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ సేకరించి మిల్లులకు తరలించింది. ఇంకా అనేక గ్రామాల్లో పంటను కోత కోయించి బహిరంగ ప్రదేశాలు, కల్లాల్లో రైతులు ఆరబోసుకున్నారు. వర్ష సూచనతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన మోస్తరు వర్షాలకే జిల్లాలో పలు చోట్ల రాసులపైన ఉన్న ధాన్యం మొలకలు వచ్చింది. ఎకరాకు 7 నుంచి 10 బస్తాలు వరకూ నష్టాన్ని చవిచూశారు. కల్లాలు, రోడ్డు మార్జిన్‌లలో ఆరబోసిన ధాన్యాన్ని వర్షం బారిన పడకుండా సంరక్షించుకునేందుకు పరదాలు కప్పుకున్నారు. పూర్తిగా ఆరిన తర్వాత వాతావరణ మార్పులతో చలిగాలులు వీయడం, వర్ష సూచనలతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని రైతులు వాపోతున్నారు.



యనమలకుదురులో పొలాల్లోనే ఉన్న కోతకోసిన వరి

మినుము రైతులదీ అదే పరిస్థితి

ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా రైతాంగం జిల్లాలో అనేక చోట్ల సుమారు 3 వేల ఎకరాలకు పైగా మినుము సాగు చేసినట్లు అంచనా. ప్రస్తుతం మినుము పంట చేతికి రావడంతో రెండు రోజులుగా తీత పనులు చేపట్టారు. మినుము తీత పూర్తయిన పొలాల్లో పంట కల్లాల్లోనే ఉంది. ఈ తరుణంలో ఏర్పడుతున్న అల్పపీడనం తమను పుట్టి ముంచకుండా ఉంటే చాలని మినుము రైతులు ప్రకృతిని వేడుకుంటున్నారు.



దావులూరులో ధాన్యం రాసులపై కప్పిన పరదాలు



పునాదిపాడులో కల్లాల్లో ఉన్న మినుము పంట

గంగూరులో కలెక్టర్ బాలాజీ పర్యటన



పెనమలూరు: కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ గంగూరులో మంగళవారం రాత్రి పర్యటించారు. ఆయన తొలుత గంగూరులోని రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ రైతులకు అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20న సీఎం చంద్రబాబునాయుడు పర్యటించే అవకాశం ఉండటంతో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలీశర్మ పర్యటించారు. సీఎం టూర్ ప్రోగ్రాం ధ్రువీకరించాల్సి ఉంది. అనంతరం కలెక్టర్ గంగూరు వెంకటాద్రి రైస్ మిల్లును సందర్శించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌పై సమీక్ష

ఉయ్యూరు: విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ కోరారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన అవనిగడ్డ రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సుపై సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించి మెరుగైన సేవలు అందించేందుకు అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానుయేల్ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ముగిసిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

కంకిపాడు: డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు ముగిశాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంకిపాడు డీసీ-23, తెన్నేరు డీసీ-6 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. కంకిపాడు డీసీ ఎన్నికలో 11 సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. చైర్మన్‌గా ఈడుపుగల్లు 139 సంఘం నుంచి దేవినేని రత్నభూషణ్ ఎన్నికయ్యారు. రామినేని వెంకట రామారావు వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు. తెన్నేరు డీసీ-6కు చైర్మన్‌గా తెన్నేరు 30 సంఘం నుంచి యార్లగడ్డ రాజారావు ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా తోట సాంబశివరావు ఎన్నుకోబడ్డారు. ఎన్నికల అధికారులు విజయ వర్ధన్, నర్సింహులు ధ్రువీకరణ పత్రాలను అందించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, పలువురు రైతు ప్రతినిధులు డీసీ కమిటీ నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సత్కరించారు.

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)ల ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని కేసరపల్లి ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1కి అధ్యక్షుడిగా కొసరాజు రాంబాబు(రాము), ఉపాధ్యక్షుడిగా జాస్తి విజయభూషణ్ కుమార్(బుజ్జి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని నున్న డీసీ-11 అధ్యక్షుడిగా పామర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఉప్పు వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వయోజన విద్య జిల్లా డెప్యూటీ డైరెక్టర్ ఎండీ హాజీ బేగ్, సహాయక ఎన్నికల అధికారిగా మచిలీపట్నం డ్రైనేజీ సెక్షన్-2 ఏఈఈ ఎండీ నజ్మారాణి వ్యవహరించారు.



తెన్నేరు (డీసీ-6) చైర్మన్‌గా ఎన్నికైన రాజారావుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో నాగార్జున సాగర్ ఎడమకాలువ జోన్-3 పరిధిలోని బాపులపాడు మేజర్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు పరిధిలోని ఏలూరు కాలువ కాకులపాడు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం జరిగాయి. బాపులపాడు మేజర్ డీసీ ఎన్నికల్లో చైర్మన్‌గా రంగన్నగూడెంకు చెందిన ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, వైస్‌చైర్మన్‌గా గంపా చిన్న పండిడేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. బాపులపాడు మేజర్ పరిధిలో ఏడు సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా, డీసీ ఎన్నికలకు రేమల్లే డబ్ల్యూయూఏ అధ్యక్షుడు గైర్హాజరు అయ్యారు. కాకులపాడు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా తిప్పనగుంటకు చెందిన కొమ్మారెడ్డి రాజేష్, వైస్‌చైర్మన్‌గా నల్లిబోయిన గోపాలకృష్ణాలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

పెనమలూరు: రెవెన్యూ సదస్సుల నిర్వహణతో భూసమస్యలు పరిష్కారం చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. పోరంకిలోని సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులు 15 రోజుల్లో పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. గ్రామానికి చెందిన భూయజమానులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భరద్వాజ్, సర్వేయర్ శివరామకృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ, రైతుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు రూరల్ మండల తహసీల్దారు బి.సుగుణకు వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్పంచి కాటూరి సరళతో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని దావులూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ వి.భావనారాయణ మాట్లాడుతూ భూవివాదాల పరిష్కారానికి, మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని భూ సంబంధ సేవలు పొందాలని సూచించారు.



పోరంకిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



నున్న రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుగుణ

ఖాళీ స్థలాలు.. మురుగునీటి తటాకాలు

- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు
- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్న వైనం
- అధికారుల చర్యలు శూన్యం

కంకిపాడు: జనావాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. విష కీటకాలు, దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. ఏ గ్రామంలో చూసినా ఇదే సమస్య. ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారవడంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఖాళీస్థలాల్లో నిలిచిపోయిన నీరు, పిచ్చిమొక్కలతో పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు వ్యాధుల భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

దోమలకు ఆవాసంగా

ఖాళీ స్థలాలు చాలా వరకు మెరకలు లేకపోవడంతో పల్లంగా ఉన్నాయి. స్థల యజమానులు స్థలాలను కొనుగోలు చేసి వాటి మెరకలు, సంరక్షణ చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారు. దీనికి తోడు స్థానికులు వినియోగించే వ్యర్థ నీరు సైతం ఖాళీస్థలాలను ముంచెత్తుతోంది. రోజులు తరబడి నీరు కదలక తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. వర్షాలు పడితే మాత్రం ఈ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. రోజుల తరబడి స్థలాలు మురుగునీటి తటాకాలుగా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమలు విజృంభించి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా మండల కేంద్రమైన కంకిపాడులో ఖాళీస్థలాల సమస్య అధికంగా ఉంది. మండలంలోని వివిధ గ్రామాల్లోనూ ఇదే సమస్య. వీటి ఫలితంగా వ్యాధుల భయం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఖాళీస్థలాల్లో కంప తొలగింపు, మెరక పనులు చేసేలా యజమానులకు అధికారులు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



కంకిపాడు లాకు రోడ్డులోని ఓ వెంచరు పరిసరాల్లో ఉన్న మురుగు



కంకిపాడు బ్యాంకు కాలనీలో రోడ్డు పక్కన ఖాళీస్థలాల్లో పిచ్చి కంప

భయాందోళనలో ప్రజలు

ఖాళీస్థలాల సమస్య మండలాన్ని పట్టి పీడిస్తోంది. ప్రధాన గ్రామాలతో పాటుగా రియల్ వెంచర్లలోనూ స్థలాలు కొనుగోలు చేసి ఎలాంటి మెరకలు చేయకుండా యజమానులు వదిలేస్తున్నారు. దీంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తున్నాయి. పాములు, విష కీటకాలకు ఆవాసంగా మారుతున్నాయి. రాత్రిళ్లు ఆ స్థలాల వెంబడి ఉన్న రహదారుల గుండా రాకపోకలు సాగించలేని దుస్థితి. విష కీటకాలు, పాములు రోడ్లపై సంచరిస్తుండటంతో జనం భయంతో జీవిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి విష కీటకం బారిన పడాల్సి వస్తుందోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు.

భరించలేని దుర్గంధం



ఖాళీస్థలాల కారణంగా ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోతోంది. మురుగు నీటి చెరువులను తలపిస్తున్నాయి. దోమలు వ్యాప్తి చెందేందుకు ఆస్కారం ఎక్కువ. మురుగు నుంచి వెలువడే దుర్గంధం భరించలేని పరిస్థితి. కంకిపాడు బ్యాంకు కాలనీ పరిసరాల్లో సమస్య అధికంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యపై దృష్టి సారించి పట్టణ ప్రజలకు మేలు చేకూరేలా చూడాలి. – తంబాబత్తుల శేషు, కంకిపాడు

చేతిరాత పోటీల్లో విజేతకు కలెక్టర్ అభినందన



ధరణిప్రియకు మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి చేతిరాత పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజయవాడ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని డి.ధరణిప్రియను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం అభినందించారు. ఈ పోటీల్లో మొత్తం 11,624 మంది విద్యార్థులు పాల్గొనగా ధరణిప్రియ రెండు రాష్ట్రాల్లో కలిపి 3వ ర్యాంకు సాధించింది. కలెక్టర్ బాలాజీ మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో విజేత ధరణిప్రియను సన్మానించి, ఆమెకు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందజేసి అభినందనలు తెలిపారు. ఇలానే ధరణిప్రియ మరిన్ని పతకాలను సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం పరసా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ధరణిప్రియకు అభినందనలు తెలిపారు.

చిత్తులాటలో 14 మంది అరెస్టు

ఉయ్యూరు: చిత్తులాట ఆడుతున్న 14 మందిని ఉయ్యూరు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రూరల్ ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపిన కథనం మేరకు.. మండలంలోని చిన ఓగిరాల శివారులో పొలం బాట మీద చిత్తులాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్‌బాబు వ్యవసాయ పనులు చేసే కూలీ మాదిరిగా వెళ్లి శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1.46 లక్షలు నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

పెనమలూరు: పోరంకిలో బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ టి. అశోక్, వంశీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు వివరాలు తెలుపుతూ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ స్మారక చెడుగుడు పోటీలను ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండవ బహుమతి రూ. 22 వేలు, మూడవ బహుమతి రూ. 17 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆరవ స్థానం వరకు బహుమతులు ఉంటాయని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ఇతర నగదు బహుమతులు కూడా అందజేస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, హెచ్ఎం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. 'ఆరోగ్యంగా ఉండండి-అందమైన జీవితాన్ని కలలు కనండి' అనే నినాదంతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఫిట్ ఇండియా ర్యాలీ కొనసాగింది. వ్యాయామ విద్యా సహాయకుడు ధనియాల నాగరాజు, అధ్యాపకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.